వాయిస్ ఆఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

VOICE OF PRAJALU

తెలుగు దినపత్రిక

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow


పేజీలు 10

సోమవారం, మార్చి 16, 2026

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## చైనాను కూడా అడుక్కుంటున్నాడు.. ట్రంప్ ను ఎగతాళి చేసిన ఇరాన్

పశ్చిమాసియాలో ముదిరిన ఉద్రిక్తత ఇరాన్, అమెరికాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. హర్మూజ్ జలసంధిని సురక్షితంగా ఉంచేందుకు జపాన్, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన విజ్ఞప్తిని ఇరాన్ ఎగతాళి చేసింది. అమెరికా చివరకు తన బద్ధశత్రువు చైనాను కూడా సాయం కోరడంపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ వ్యంగ్యాస్త్రాలు సంధించింది.









# 5 రాష్ట్రాల్లో మోగిన ఎన్నికల నగారా

## తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో ఒకే విడతలో ఎన్నికలు

- పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో పోలింగ్
- కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల
- మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్
- మే 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి
- 2.19 లక్షల పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



న్యూఢిల్లీ, మార్చి 16 : దేశ రాజకీయాల్లో కీలకమైన ఐదు ప్రాంతాల్లో అసెంబ్లీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించింది. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషనర్లు ఎస్.ఎస్. సంధు, వివేక్ జోషీలతో కలిసి ఆదివారం న్యూఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించి ఎన్నికల తేదీలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో

(మిగతా 2వ పేజీలో)



# ఐక్యతే తెలంగాణ శక్తి: సీఎం రేవంత్

- మత సామరస్యం రాష్ట్ర పురోగతికి పునాది
- గంగాజమునా సంస్కృతి తెలంగాణ ప్రత్యేకత అని వ్యాఖ్య
- మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి కట్టుబాటు
- రంజాన్ ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి సందేశం
- సంక్షేమ పథకాలలో మైనారిటీలకు సముచిత ప్రాధాన్యం
- సేవా భావం, క్రమశిక్షణకు ప్రతీక రంజాన్ మాసం

హైదరాబాద్, మార్చి 16 : తెలంగాణ రాష్ట్రంలో మత సామరస్యం, ఐక్యతే అసలైన అభివృద్ధి శక్తి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గంగాజమునా సంస్కృతి తెలంగాణ నేలపై బలంగా వర్ధిల్లుతోందని, అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి జీవించడం రాష్ట్ర ప్రత్యేకత అని అన్నారు. దేశంలో కొందరు మతపరమైన విభేదాలను పెంచేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి సామరస్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం

(మిగతా 2వ పేజీలో)

# నేటి నుంచి శాసనసభ, మండలి సమావేశాలు

- గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- 20న 202627 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- నెలాఖరు వరకు సమావేశాలు జరిగే అవకాశం
- అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ
- బీఏసీ సమావేశంలో ఎజెండా ఖరారు
- స్పీకర్‌పై అవిశ్వాసం సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తున్న బీఆర్ఎస్
- బడ్జెట్ భేటీ ఏర్పాట్లపై స్పీకర్, చైర్మన్ సమీక్ష

హైదరాబాద్, మార్చి 16 : తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్‌ను ఈ సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టి సభ ఆమోదం పొందనుంది. ఉదయం 11:45 గంటలకు సమావేశాలు ప్రారంభమవుతాయి. రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం సభ మంగళవారానికి వాయిదా పడుతుంది. తర్వాత శాసనసభా వ్యవహారాల సలహా కమిటీ (బీఏసీ) సమావేశమై సమావేశాల పూర్తి ఎజెండాను ఖరారు చేయనుంది. ఈ నెలాఖరు వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగనున్నట్టు సమాచారం.

### ముందుగా తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ

సమావేశాల ప్రారంభానికి ముందు అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆవిష్కరించనున్నారు. ఉదయం 11:27 నుంచి 11:37 నిమిషాల మధ్య ఈ కార్యక్రమం జరగనుందని

(మిగతా 2వ పేజీలో)



### మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం

# మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి జైలుకు

- ఫాంహౌస్ పార్టీ కేసులో కీలక మలుపు..
- రోహిత్‌రెడ్డి సహా ముగ్గురికి 14 రోజుల రిమాండ్
- డ్రగ్స్ పరీక్షల్లో ఆరుగురికి పాజిటివ్
- ఏలూరు ఎంపీకి కూడా డ్రగ్స్ ఆనవాళ్లు
- పోలీస్ దాడి సమయంలో కాల్పుల ఆరోపణలు
- డ్రగ్స్ సరఫరాపై మరింత విచారణ
- మొయినాబాద్ కేసుతో రాజకీయ వర్గాల్లో చర్చ



మొయినాబాద్/చేవెళ్ల, మార్చి 15: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. రోహిత్‌రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, నమిత్ శర్మలకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఈ ముగ్గురిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్

ఫాంహౌస్‌లో జరిగిన పార్టీలో పాల్గొన్న వారందరికీ పోలీసులు యూరిన్, రక్త పరీక్షలు నిర్వహించారు. మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకోగా.. అందులో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. పాజిటివ్‌గా తేలిన వారిలో రోహిత్‌రెడ్డి, ఆయన సోదరుడు రితేశ్‌రెడ్డి, నమిత్ శర్మతో పాటు ఏపీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్, కౌశిక్ రవి, అర్జున్‌రెడ్డి ఉన్నట్లు వెల్లడించారు.

### కొందరికి స్టేషన్ బెయిల్

డ్రగ్స్ కేసులో నిందితులుగా ఉన్నప్పటికీ ఎంపీ మహేశ్‌కుమార్‌తో పాటు మరికొందరికి పోలీసులు స్టేషన్ బెయిల్ ఇచ్చి

(మిగతా 2వ పేజీలో)



కేటీఆర్ డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధమా?
టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సవాల్



డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...
కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్

# ఇరాన్‌పై దాడుల తీవ్రత.. ఇస్ఫహాన్‌లో బాంబుల వర్షం

- అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో భారీ నష్టం
- ఇస్ఫహాన్‌లో 15 మంది మృతి, పలువురు గాయాలు
- అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్ దాడులు
- యుద్ధం ఇంకా మూడు వారాలు కొనసాగే అవకాశం



దుబాయ్/టెహ్రాన్, మార్చి 16: పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు కొనసా గుతున్నాయి. ఇజ్రాయెల్, అమెరికా మరియు ఇరాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలు ఆదివారం నాటికి 16వ రోజుకు చేరాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని ప్రముఖ పారిశ్రామిక నగరం ఇస్ఫహాన్‌పై అమెరికా సైన్యం భారీ బాంబుదాడులు చేపట్టింది. ఈ దాడుల్లో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక వర్గాలు వెల్లడించాయి. మరికొందరు గాయపడ్డారు.

### ఇరాన్‌లో ఉద్రిక్తతలు

వాయవ్య ఇరాన్‌లో ఇజ్రాయెల్‌కు సహకరిస్తున్నారన్న అనుమానంతో 20 మందిని పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. మరోవైపు ఇరాన్ ఇస్లామిక్

(మిగతా 2వ పేజీలో)

# ఐక్యతే తెలంగాణ శక్తి: సీఎం రేవంత్

సాయంత్రం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన రంజాన్ ఇఫ్తార్ విందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడ అశాంతి నెలకొన్నా తెలంగాణలో మాత్రం మత సామరస్యంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



**మైనారిటీలకు ప్రత్యేక ప్రాధాన్యం**

రాష్ట్రంలో మైనారిటీల సమగ్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. పరిపాలనలోనూ, రాజకీయాల్లోనూ మైనారిటీలకు సముచిత స్థానం కల్పిస్తున్నామని చెప్పారు. ఎల్బీ స్టేడియంలో క్రికెట్ ఆడిన మాజీ భారత కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్‌ను మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా నియమించామని గుర్తు చేశారు. అదనంగా ఎనిమిది మంది మైనారిటీ నేతలకు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లుగా బాధ్యతలు అప్పగించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

**నాలుగు శాతం రిజర్వేషన్ల ప్రాధాన్యం**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లిం మైనారిటీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలక పాత్ర పోషించిన సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ సేవలను గుర్తిస్తూ ఆయనను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించామని సీఎం తెలిపారు. ఆ రిజర్వేషన్ల వల్ల వేలాది మంది ముస్లిం యువత డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదిగి సమాజంలో గుర్తింపు పొందారని అన్నారు.

**క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం**

ప్రపంచ స్థాయిలో తెలంగాణకు ఖ్యాతి తెచ్చిన క్రికెటర్ మహ్మద్ సిరాజ్, బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌లను డీఎస్పీలుగా నియమించి ప్రభుత్వం గౌరవించిందని సీఎం పేర్కొన్నారు. అదనంగా వారికి ఆర్థిక సహాయం అందించి ప్రోత్సహించామని చెప్పారు.

**రంజాన్ సందేశం సేవా భావం**

రంజాన్ మాసం కేవలం పండుగ మాత్రమే కాదని, అది క్రమశిక్షణ, ఆత్మశుద్ధి, మానవతా విలువలను గుర్తు చేసే పవిత్ర కాలమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక నెలపాటు ఉపవాస దీక్షలు పాటిస్తూ తోటి మనుషులకు సహాయం చేయడం ద్వారా ఈ మాసం గొప్ప సందేశాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రతి సంక్షేమ పథకంలో మైనారిటీలకు సముచిత భాగస్వామ్యం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మైనారిటీ సమాజం కీలక పాత్ర పోషించాలని, వారి ప్రార్థనలు రాష్ట్రానికి రక్షణ కవచంలా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, రాజ్యసభ సభ్యులు, ముస్లిం మత పెద్దలు మరియు వేలాది మంది మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శాసనసభ, మండలి సమావేశాలు



అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం అసెంబ్లీలో చర్చ జరగనుంది. మంగళ, బుధవారాల్లో చర్చ అనంతరం తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉంది. ఉగాది సందర్భంగా గురువారం సభకు సెలవు ఉంటుంది. మళ్లీ ఈ నెల 20న ఉభయ సభలు సమావేశం కానుండగా, అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ భట్టి విక్రమార్క, శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. తర్వాత రోజు రంజాన్ సందర్భంగా సభ జరగదు. మళ్లీ 23 నుంచి వారం రోజుల పాటు సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది.

**తొలిసారి ఒకే ప్రాంగణంలో అసెంబ్లీ, మండలి**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తర్వాత తొలిసారి శాసనసభ, శాసనమండలి ఒకే ప్రాంగణంలో సమావేశం కానున్నాయి. ఇప్పటివరకు జూబ్లీహాల్‌లో జరుగుతున్న మండలి సమావేశాలను ఈసారి పునరుద్ధరించిన పాత అసెంబ్లీ భవనంలో నిర్వహించనున్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఈ భవనాన్ని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల కోసం ఉపయోగించగా, అమరావతికి మారిన తర్వాత ఖాళీగా ఉంది. ప్రభుత్వం దీనిని పునరుద్ధరించి మండలి సమావేశాలకు సిద్ధం చేసింది.

**అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చ**

ఈసారి బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా సాగనున్నాయి. గత రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వచ్చే ఏడాదికి సంబంధించిన ప్రణాళికలను ప్రభుత్వం సభ ముందు ఉంచనుంది. మూసీ నది పునరుజ్జీవం, తెలంగాణ ఉద్యమకారుల అంశం వంటి విషయాలపై కూడా చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. పలు కీలక బిల్లులను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

కేసీఆర్ హాజరయ్యే అవకాశాలు

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ప్రభుత్వం పై తీవ్రంగా విమర్శలు చేయడానికి సిద్ధమవుతోంది. ఆ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. తమ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత కేసులో అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్ అసంతృప్తిగా ఉంది. ఈ నేపథ్యంలో స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే సభలో తమ బలం సరిపోతుందా అనే అంశంపై ఆ పార్టీ నాయకత్వం ఇంకా సమాలోచనలు చేస్తోంది.

**ప్రభుత్వాన్ని నిలదీయడానికి బీజేపీ సిద్ధం**

బడ్జెట్ సమావేశాల్లో అధికార పక్షాన్ని నిలదీయడానికి బీజేపీ కూడా సిద్ధమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేశారు. మూసీ పునరుద్ధరణ, హైడ్రా చర్యలు, పేదల ఇళ్ల కూల్చివేత వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని నిర్ణయించారు. ప్రజల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని భావిస్తున్నారు.

**సమావేశాల నిర్వహణపై సమీక్ష**

అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, భద్రత, వసతులపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. సభ జరుగుతున్న సమయంలో ధర్నాలు, ఆందోళనలకు అవకాశం ఇవ్వకూడదని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, సభ్యులు అడిగే ప్రశ్నలకు వెంటనే సమాచారం అందించాలని స్పీకర్ సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సభ సజావుగా జరగేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించి సమన్వయం చేయనున్నట్టు వెల్లడించారు.

# ఇరాన్‌పై దాడుల తీవ్రత..

రెవల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతార్‌లోని అమెరికా లక్ష్యాలపై దాడులకు దిగినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. పశ్చిమాసియాలోని అమెరికా పరిశ్రమలను తరలించుకోవాలని హెచ్చరించింది.

**ప్రతీకారం తప్పదని హెచ్చరిక**

ఇరాన్‌లో జరిగిన దాడుల్లో సాధారణ పౌరులు మృతి చెందారని పేర్కొంటూ ఐఆర్‌జీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనలకు ప్రతీకారం తప్పదని హెచ్చరించింది. అమెరికా కంపెనీలను లక్ష్యంగా చేసుకుంటామని కూడా ప్రకటించింది. ఇరాన్ సుప్రీం కమాండర్ మొజ్తబా ఖమేనీ క్షేమంగా ఉన్నారని విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తెలిపారు.

**గల్ఫ్‌లో క్షిపణుల దాడులు**

యూఏఈలోని అమెరికా అల్‌డాఫ్రా ఎయిర్‌బేస్‌పై ఇరాన్ 10 క్షిపణులు ప్రయోగించినట్లు సమాచారం. బహ్రెయిన్‌లో సైరన్లు మోగగా, అనుమానాస్పద ప్రచారంపై పలువురిని అరెస్టు చేశారు. సౌదీ అరేబియా కూడా తమ గగనతలంలోకి ప్రవేశించిన డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నట్లు ప్రకటించింది.

**యుద్ధంలో భారీ నష్టం**

ఫిబ్రవరి 28 నుంచి కొనసాగుతున్న ఈ యుద్ధంలో ఇరాన్‌లో ఇప్పటికే 10 వేల ఇళ్లు ధ్వంసమయ్యాయని నివేదికలు సూచిస్తున్నాయి. ఇప్పటివరకు 1,400 మందికిపైగా మరణించినట్లు అంచనా. ఇజ్రాయెల్ దాడిలో తమ సీనియర్ సైనిక అధికారి బ్రిగేడియర్ జనరల్ అబ్దుల్లా జలాలీ నసబ్ మరణించినట్లు ఇరాన్ ప్రకటించింది.

**ఇజ్రాయెల్‌పై రాకెట్లు**

ఇరాన్ సైన్యంతో పాటు లెబనాన్ నుంచి హెజ్‌బొల్లా మిలిటెంట్లు కూడా ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగించారు. టెల్ అవీవ్, హోలోన్ ప్రాంతాల్లో రాకెట్ శిథిలాలు పడడంతో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. కొన్ని రాకెట్లను



ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుంది. అయితే సెంట్రల్ ఇజ్రాయెల్‌లో ఓ అపార్టుమెంట్ భవనం ధ్వంసమైంది.

**యుద్ధం ఇంకా కొనసాగొచ్చు**

ఇరాన్‌పై యుద్ధాన్ని కనీసం మరో మూడు వారాలు కొనసాగించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇక యుద్ధం మరింత ముదిరితే ఇరాన్, హెజ్‌బొల్లా దాడులను ఎదుర్కోవడం కష్టమవుతుందన్న అభిప్రాయం కూడా విశ్లేషకుల్లో వినిపిస్తోంది.

**ఒప్పందానికి సిద్ధం కాదన్న ట్రంప్**

ఇరాన్ యుద్ధాన్ని ముగించేందుకు ఒప్పందానికి ఆసక్తి చూపుతున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అయితే ప్రస్తుతం తాము అలాంటి ఒప్పందానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధిలో చమురు రవాణా అంతరాయం కలగకుండా ఇతర దేశాలతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. చమురు సరఫరాపై ఆధారపడే దేశాలు యుద్ధ నౌకలను పంపాలని కూడా ఆయన కోరారు.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసు సంచలనం
## మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి జైలుకు

విడుదల చేశారు. మిగిలిన ముగ్గురిపై మాత్రం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసిన సమయంలో కాల్పులు చోటుచేసుకున్నట్లు వెల్లడించారు. నమిత్ శర్మ కాల్పులు జరిపాడని, అయితే తుపాకీ లైసెన్స్ రితేశ్‌రెడ్డి పేరిట ఉందని పోలీసులు తెలిపారు. కాల్పులు జరపాలని రోహిత్‌రెడ్డి సూచించినట్లు ఆరోపించారు. ఈ అంశాల ఆధారంగానే ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

**రోజంతా హైడ్రామా**

శనివారం రాత్రి ఈగల్ టీం, ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు కలిసి ఫాంహౌస్‌పై దాడులు నిర్వహించారు. అనంతరం నిందితులను మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు కాకుండా శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిందితులు ఎక్కడ ఉన్నారన్న అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

**డ్రగ్స్ సరఫరాపై దర్యాప్తు**

ఫాంహౌస్ పార్టీలో డ్రగ్స్ ఎలా చేరాయన్న దానిపై పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. రోహిత్‌రెడ్డి పీఏ ఇచ్చిన సమాచారం ఆధారంగా కౌశిక్ రవిని ప్రశ్నించారు. బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి సిమ్లా ట్రిప్ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. పోలీసుల దాడి సమయంలో రోహిత్‌రెడ్డి పీఏ శ్రవణ్ తన వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను ధ్వంసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. అందులో ఒకటి రోహిత్‌రెడ్డి ఫోన్ కాగా, మరొకటి శ్రవణ్‌దిగా గుర్తించారు. ఈ ఘటనపై కూడా పోలీసులు ప్రత్యేకంగా విచారణ కొనసాగిస్తున్నారు.

## కేటీఆర్ డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధమా?
## ::: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సవాల్

హైదరాబాద్, మార్చి 16 : మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన బృందం సమాధానం చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజం కోసమే 'ఈగల్' బృందం దాడులు చేస్తోందని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని స్పష్టం చేశారు. "కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలి. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం పరీక్షలు చేయించుకుందాం" అని ఆయన సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు.

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...
## కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉన్నానని ఆదివారం ప్రకటించారు. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు విసిరిన సవాల్‌ను ఆయన స్వీకరించారు. డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. "ఏ టెస్టుకైనా నేను సిద్ధమని ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరీక్ష చేయించుకోవాలన్న మహేశ్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాను. మనమే ఉదాహరణగా నిలుద్దాం" అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ డ్రగ్స్ టెస్టుకు రావాలని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. శనివారం రాత్రి మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌పై పోలీసులు దాడి చేయగా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహా ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామాలపై స్పందించిన కేటీఆర్.. డ్రగ్స్ కేసును అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లడం నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రతీ డ్రగ్స్ కేసులోకి అనవసరంగా తన పేరును లాగితే చట్టపరమైన నోటీసులతో స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. హైదరాబాద్ శివారు మొయినాబాద్‌లోని ఫామ్‌హౌస్‌పై శనివారం రాత్రి ఈగిల్ బృందం దాడి చేయగా, టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. పట్టుబడిన వారిని ఈగిల్ బృందం మొయినాబాద్ పోలీసులకు అప్పగించింది.

## 5 రాష్ట్రాల్లో మోగిన ఎన్నికల నగారా



మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 23న, రెండో దశ ఏప్రిల్ 29న జరుగుతుంది. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే దశలో ఓటింగ్ నిర్వహించనున్నారు. కేరళలో 140, అస్సాంలో 126, పుదుచ్చేరిలో 30 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 9న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. ఈ ఐదు ప్రాంతాల్లో జరిగిన పోలింగ్ అనంతరం మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఎన్నికల్లో మొత్తం 824 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరుగుతుందని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. ఈ ఎన్నికల్లో సుమారు 17.4 కోట్ల మంది ఓటర్లు పాల్గొననున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా 2.19 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి కేంద్రంలో సగటున 750 నుంచి 900 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఎన్నికల నిర్వహణ కోసం దాదాపు 25 లక్షల మంది సిబ్బంది విధుల్లో పాల్గొనను న్నారని సీఈసీ తెలిపారు. వృద్ధులు, దివ్యాం గులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి సౌకర్యవంతంగా ఓటు వేయేలా చర్యలు తీసు కుంటున్నామని పేర్కొన్నారు. యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. గత ఎన్నికల్లో హింసకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించింది.

ఎన్నికల ప్రక్రియలో డబ్బు, ప్రలోభాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని కూడా స్పష్టం చేసింది.

**8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు**

దేశంలోని ఆరు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు కూడా ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించింది. మహారాష్ట్ర, కర్నాటకల్లో రెండేసి స్థానాలకు, గోవా, గుజరాత్, నాగాలాండ్, త్రిపురలో ఒక్కో స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. గోవా, కర్నాటక, నాగాలాండ్, త్రిపురల్లో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, గుజరాత్, మహారాష్ట్రలో ఏప్రిల్ 23న ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు కూడా మే 4న జరుగుతుంది.

# మున్నూరు కాపు మహిళా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం




హైదరాబాద్ (వాయిస్ టుడే) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహిళా కమిటీ ఆధ్వర్యంలో మున్నూరు కాపు మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కుల కోసం మహిళలే ముందుకు వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని, అలాగే ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు సమాన హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ మహిళా అధ్యక్షురాలు మహిళా సీనియర్ సిటిజన్లను శాలువాలు, మూమెంటోలను అందజేసి సత్కరించారు. అలాగే కార్యక్రమానికి హాజరైన ప్రతి మున్నూరు కాపు సోదర సోదరీమణులకు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావు తన సొంత నిధులతో మూమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ అన్నపూర్ణ, మహాసభ ప్రధాన కార్యదర్శి గండు సతీష్ కుమార్, కార్యదర్శి చెల్మిల్లి మహేష్ కుమార్, ఆఫీస్ కార్యదర్శి ఆకుల రాకేష్, మహాసభ కోశాధికారి కావేటి అజయ్ కుమార్, పుస్తెమెట్టల కమిటీ కన్వీనర్ దండు నరేందర్, మహాసభ కార్యవర్గ సభ్యులు తోట శంకర్, కొమ్మ దామోదర్, దండారి జ్యోతి, జగడం రచన, సృజన, పిల్లి అన్నపూర్ణ, అరవింద, పద్మ, ఢమరుక, దండు అనిత, అహల్య, భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.



## కుల చేతివృత్తుల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్దపీట వేయాలి

### బీసీ సాధికారిత సంఘం నేతలు

హైదరాబాద్ (వాయిస్ టుడే) : అంతరించిపోతున్న కుల చేతివృత్తులతో ఉపాధి కరువై బీసీల జీవనం దుర్భరంగా మారుతోందని, రేపు ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో ఈ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని బీసీ సాధికారిత సంఘం నేతలు కోరారు. వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చిన బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్‌ను బీసీ నేతలు కొండ దేవయ్య పటేల్, పొలాస నరేందర్, ఇల్లందుల వెంకటేష్ తదితరులు శాలువాలతో ఘనంగా సత్కరించి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ, రోజురోజుకూ కనుమరుగవుతున్న కుల చేతివృత్తులతో జీవనం అస్తవ్యస్తంగా మారి బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలంటే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, రేపటి బడ్జెట్‌లో వాటికి తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఉత్తర తెలంగాణ ఇంచార్జ్ పొలాస నరేందర్ మాట్లాడుతూ, కులవృత్తులు కనుమరుగవడంతో అనేక మంది యువకులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు పాలకవర్గాలను నియమించి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ, బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేపు అసెంబ్లీలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి సరిపడ నిధులు కేటాయించి బీసీలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పట్టణ బీసీ సాధికారిత సంఘం ప్రధాన కార్యదర్శి ఇల్లందుల వెంకటేష్‌తో పాటు పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

## మితిమీరిన వేగం.. రెండు నిండు ప్రాణాలు బలి





ఘట్‌కేసర్: అతనికి డ్రైవింగ్ సరిగా రాదు.. అయినా కారును అతివేగంగా నడిపి బీభత్సం సృష్టించాడు. ఈ ఘటనలో భార్యాభర్తలు మృతి చెందగా కుమారుడు క్షేమంగా బయటపడ్డాడు. ఈ ఘటన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారంపెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన మర్రి ప్రశాంత్(38) మెడికల్ రిప్రజెంటేటివ్. రాంనగర్‌లో ఉంటున్నారు. భార్య శ్రావణి (35), కుమారుడు సహస్రార్ (12) (ఏడోతరగతి) ఉన్నారు. శనివారం పెళ్లిరోజు వేడుక ఘనంగా చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం బైకుపై మేడిపల్లిలో బంధువుల ఇంటికి బయలుదేరారు. పీర్జాదిగూడ డెకథ్లాన్ వద్దకు రాగానే అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ముగ్గురూ పడిపోయారు. తీవ్ర గాయాలతో ప్రశాంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆసుపత్రిలో భార్య చికిత్స పొందుతూ మృతిచెందింది. కుమారుడు చికిత్స పొందుతున్నాడు. కారు నడిపిన వ్యక్తి ఉప్పల్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన కండక్టర్ రామయ్య. సరిగా డ్రైవింగ్ రాదు. ఆదివారం కారు తీసుకెళ్తుంటే కుటుంబ సభ్యులు వద్దని వారించినా తీసుకెళ్లాడని కాలనీవాసులు చెప్పారు. అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



# 21న మా భగవతి విశాల్ జాగరణ్

### మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్

హైదరాబాద్, మార్చి 15: సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా, దైవిక రక్షణ, కుటుంబాల ఆశీర్వాదం కోసం ప్రేమ, కరుణ, భక్తి, ధర్మం వంటి విలువలను పెంపొందించేందుకు హైదరాబాద్, నాంపల్లి, ఎక్షిబిషన్ గ్రౌండ్స్ లో 2026, మార్చ్ 21 న "మా భగవతి విశాల్ జాగరణ్" ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు మా వైష్ణో దేవి మాతా జాగరణ్ మండల్, హైదరాబాద్ కోర్ కమిటీ సభ్యులు రామ్ కిషన్ అగర్వాల్, అంజనీ కుమార్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్‌పురియా, సంజయ్ అగర్వాల్, ధీరజ్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, పురుషోత్తం అగర్వాల్, ముఖేష్ అగర్వాల్, రాకేష్ జలాన్, , సూర్యకమల్ జి పుత్రా, అంజనీ కుమార్ సరోగి, లు ప్రకటించారు. హైదరాబాద్, నాంపల్లి, ఎక్షిబిషన్ గ్రౌండ్స్ లో ఆదివారం "మా భగవతి విశాల్ జాగరణ్" ఏర్పాట్లలో భాగంగా వారు భూమి పూజ నిర్వహించి అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మార్చ్ 21 న సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం "మా భగవతి విశాల్ జాగరణ్" ప్రారంభమౌతుందని, జోధ్‌పూర్ కు చెందిన ప్రముఖ జాతీయవాద గాయకుడు ఛోటూ సింగ్ రావ్నా న్యూఢిల్లీ కు చెందిన ప్రముఖ భజన గాయకుడు సుమిత్ సైని, హైదరాబాద్‌కు చెందిన ప్రధాన భజన గాయకుడు భజన సామ్రాట్ మురారి దహిమా తదితరులు పూజలో భాగంగా భజనలు మరియు భక్తి గీతాలు ఆలపిస్తారని వారు తెలిపారు. సుమారు 20,000 మంది భక్తులు హాజరవుతారని, ఉచిత ప్రవేశం, ఫలహారాలు మరియు విందు, 'ప్రసాదం' జాగరణకు హాజరయ్యే భక్తులకు ఉచితంగా పంపిణీ చేయబడుతుందని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు తదితరులు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందుతారని వారు తెలిపారు. తల్లి భగవతి ఆస్థానంలో అఖండ జ్యోతి, మహాసభ, అతీంద్రియ దర్శనం, భజన గంగా, మాత నిధి, తారా రాణి కథ, ఆర్తి వంటివి జరుగుతాయని, భక్తులందరూ తమ కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో కలిసి వచ్చి తల్లి భగవతి ఆశీస్సులకు పాత్రులు అయి వారి జీవితాన్ని విజయవంతం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేసారు.



## ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్

హైదరాబాద్, మార్చి 15: ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్ ముదిరాజ్ అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున అందజేసే రంజాన్ తోఫాలను జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ లోని మస్తాన్ సాబ్ మజీద్ లో ముస్లింలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మస్లింలకు మరిన్ని సంక్షేమ పథకాలు చేరువయ్యేలా కృషి చేస్తామన్నారు. అంబర్ పేట నియోజకవర్గంలో ప్రతి ముస్లిం కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

## వైశ్య అచీవర్స్ అవార్డ్స్ లోగోను వినియోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

### వైశ్య అచీవర్స్ అవార్డ్స్ వ్యవస్థాపకులు, చైర్మన్ రాజు మడిపడిగె




హైదరాబాద్, మార్చి 15: వైశ్య అచీవర్స్ అవార్డ్స్ లోగోను కొంత మంది అనధికారికంగా వినియోగించడంపై ఆ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ రాజు మడిపడిగె తీవ్ర అభ్యంతరం తెలిపారు. వైశ్య అచీవర్స్ అవార్డ్స్ లోని కొంతమంది డైరెక్టర్లు సంస్థ నుంచి బయటకు వెళ్ళి సంస్థ పేరును, లోగోను అనధికారికంగా వినియోగిస్తూ తనపైనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. నరేష్ మేడ, డాక్టర్ నీలిమ, డాక్టర్ కళ్యాణి గుడుగుంట్ల, శివకుమార్ పబ్బిశెట్టి, సునీల్ మాథంశెట్టి, ఆనంద్ వుప్పుగండ్ల, సంతోష్ చేగు, డాక్టర్ జగన్నాథ్ జైన, సతీష్ యెల్లో, అనూఫ్ కుమార్ లు వైశ్య అచీవర్స్ అవార్డ్స్ (విఎఎ) బ్రాండ్ లోగోను, విఏఏ పేరును తమ అనుమతి లేకుండా వినియోగిస్తున్నారని, అలాంటి వారిపట్ల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సంస్థకు తామే కొత్త యాజమాన్యమని తప్పుడు ప్రరచారం చేస్తూ ప్రజలను, వాటాదారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై అనధికారికంగా లోగోను వినియోగిస్తున్న 10 మందిపై నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వైశ్య అచీవర్స్ అవార్డుల పేరుతో రాబోయే రోజుల్లో వీరు చేపట్టే కార్యక్రమాలపై స్టే విధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లోగోను తమ అనుమతి లేకుండా వినియోగిస్తే వారిపై చట్టపరంగా, న్యాయపరంగా తగు చర్యలు తీసుకుంటామని రాజు మడిపడిగె హెచ్చరించారు.



## ఘనంగా మోత రోహిత్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మార్చి 15: ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మోత రోహిత్ ముదిరాజ్ జన్మదినం సందర్భంగా ఆదివారం బర్కత్ పుర లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలను పార్టీ నేతలు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మోత రోహిత్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేత గండికోట కుమార్

సికింద్రాబాద్ (వాయిస్ టుడే):సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్, మాణికేశ్వర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గండికోట కుమార్ ఆదివారం టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ను గాంధీభవన్లో మర్యాదపూర్వకంగా కలిశారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం 16 మార్చి 2026

## ఐఎఫ్ఎంఐఎస్ తో ఆధార్ సరిపోలని ఉపాధ్యాయుల వేతనాలు విడుదల చేయాలి

### టీఎస్ యూటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ



సిరిసిల్ల, మార్చి 15 (వాయిస్ టుడే) ఐఎఫ్ఎంఐఎస్ తో ఆధార్ సరిపోలని ఉపాధ్యాయుల ఫిబ్రవరి నెల వేతనాలు విడుదల అయ్యేలా చొరవ తీసుకో వాలని ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ కు టిఎస్ యూటిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యం లో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం లో వినతి పత్రం సమర్పించారు. ఐఎఫ్ఎంఐఎస్ తో ఆధార్ సరిపోల లేదని, జిల్లా వ్యాప్తం గా సుమారు 30 మంది, రాష్ట్రవ్యాప్తంగా 221 మంది ఉపాధ్యాయుల వేతనాలు నిలిపి వేయడం వల్ల బ్యాంక్ ఈఎంఐ లు కట్టుకోలేక చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వ విప్ దృష్టి కి తీసుకెళ్లారు. ఈ సందర్భం గా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మహేందర్ రావు, జంగిటి రాజు లు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, జోక్యం చేసుకొని ఫైనాన్స్ డిపార్ట్మెంట్ కి వేతనాలు విడుదలయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో యూటీఎఫ్ నాయకులు అంబటి రమేష్, గాలిపెల్లి సంతోష్, ఉపాధ్యా యులు రాంప్రసాద్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అధ్యక్షురాలిని కలిసి, శుభాకాంక్షలు తెలిపిన కాముని వనిత నలినీకాంత్



రాజన్న సిరిసిల్ల జిల్లా, మార్చి 15 (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నూతన అధ్యక్షురాలిగా నియమితులై, బాధ్యతలు స్వీకరించిన ఎర్రబెల్లి స్వర్ణ ని రాజన్న సిరిసిల్ల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాముని వనిత నలినీకాంత్ ఆదివారం గాంధీ భవన్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన స్వర్ణ గతంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా, వరంగల్ మేయర్ గా కూడా పని చేశారని కాముని వనిత నలినీకాంత్ తెలిపారు. పార్టీలో సీనియరిటి కలిగిన మహిళా నేత స్వర్ణకి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పదవి దక్కడం శుభపరిణామం అన్నారు. గతంలో మాదిరిగానే, భవిష్యత్ లో సైతం స్వర్ణ నాయకత్వం లో రాష్ట్రం లో మహిళా కాంగ్రెస్ అన్నిటిలో ముందుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షురాలి ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో మహిళా కాంగ్రెస్ బలోపేతం దిశగా అడుగులు వేస్తామన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసిన మొగిలి సునీత రావు చేసిన కృషి, చొరవ, అందించిన ప్రోత్సాహం అభినందనీయని, మరువలేనిదని, ఆమె భవిష్యత్ లో మరింత ఉన్నత స్థానం కు ఎదగాలని ఆకాంక్షించారు. సునీత రావు సేవలను గుర్తించి, పార్టీ సమూచిత స్థానం కల్పిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షురాలు స్వర్ణ నాయకత్వం లో రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లా మహిళా కాంగ్రెస్ ను రాష్ట్రం లోనే ఆదర్శంగా నిలిపే దిశగా కార్యాచరణ తో ముందుకు సాగుతామని కాముని వనిత నలినీకాంత్ తెలిపారు.



## తెలుగు నూతన సంవత్సర ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): తెలుగు నూతన సంవత్సరం 2026 ఉగాది క్యాలెండర్ ను కరీంనగర్లో మేయర్ కోలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు.క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కరీంనగర్ విభాగ్ ప్రముక్ ఇప్ప లచ్చన్న మాట్లాడుతూ సనాతన ధర్మములో ఈ క్యాలెండర్ కు మహోన్నతమైన ఉందని,ఆంగ్ల సంవత్సరం జనవరి నుండి కాకుండా ఉగాది నుండే నూతన సంవత్సర వ్యవహారాలు జరుగుతాయని తెలిపారు.ఈ క్యాలెండర్ ను కరీంనగర్ మేయర్ చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండ రమణారెడ్డి,జిల్లా ధర్మవరం నిధి ప్రముఖ లంబు సుధాకర్ రెడ్డి, అద్వకేట్ కే ప్రభాకర్,ఫుల్ టైమర్ శంకర్,నరసయ్య,లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

## ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారించాలి

### ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచన.

### కరీంనగర్‌లో అధికారుల ఘన స్వాగతం



కరీంనగర్,మార్చి15(వాయిస్ టుడే):ఎస్సీ,ఎస్టీ వర్గాల సంక్షేమానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పని చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. ప్రైవేట్ కార్యక్రమం కోసం కరీంనగర్‌కు విచ్చేసిన ఆయనకు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద అధికారులు ఘన స్వాగతం పలికారు.ఇన్‌చార్జి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తిరుపతిరావు, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారి విజయపాల్ రెడ్డి,ఇన్‌చార్జి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దివాకర్ రావు తదితరులు బొకేలు అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అమలు చేస్తున్న పథకాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేస్తూ పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.





# అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలు



మియాపూర్ (వాయిస్ టుడే): వాయిస్ టుడే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మియాపూర్ డివిజన్ పరిధిలో అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో మహిళల కోసం ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. గత 15 రోజులుగా మియాపూర్ పరిధిలోని పలు కాలనీలలో మహిళల కోసం వినోదాత్మక గేమ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా పోటీలు నిర్వహించి మహిళలలోని ప్రతిభను వెలికితీయడానికి ప్రత్యేకంగా కృషి చేశారు. ఈ పోటీలలో విజేతలకు 24 మొదటి బహుమతులు (ప్రతి ఒక్కరికీ రూ.5,000 విలువైన బహుమతి), 24 రెండవ బహుమతులు (ప్రతి ఒక్కరికీ రూ.3,000 విలువైన బహుమతి) అందజేశారు. అదనంగా పోటీల్లో పాల్గొన్న సుమారు 800 మంది మహిళలకు ప్రోత్సాహకంగా చీరలను పార్టిసిపేషన్ గిఫ్టులుగా అందజేశారు.

"మహిళ మహారాణి... మహిళ సంకల్పిస్తే ఏదైనా సాధ్యం" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం మియాపూర్‌లోని ప్రగతి ఎంక్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైభవంగా జరిగింది. కార్యక్రమంలో బహుమతి ప్రదానోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, విందు కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మియాపూర్ ప్రాంత ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఉచిత అంబులెన్స్ సేవను ప్రారంభించారు. ఈ అంబులెన్స్ సేవను హైడ్రా కమిషనర్ రంగనాథ్ చేతుల మీదుగా ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఈ సేవ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, ప్రిన్సిపల్ కమిషనర్ ఇన్కమ్ ట్యాక్స్ కె. మధుసూదన్, అర్జున అవార్డు గ్రహీత జీవంజీ దీప్తి, డాక్టర్ జె.బి రావు, మియాపూర్ లా అండ్ ఆర్డర్ ఎస్.ఐ వెంకటేష్, కిమ్స్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ కావ్య ప్రియ, మియాపూర్ జడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపాల్ వసుంధర, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బోయిని మహేష్ యాదవ్, నిమ్మల రామకృష్ణ గౌడ్, మోహన్ ముదిరాజ్, మువ్వ సత్యనారాయణ, పురుషోత్తం యాదవ్, ఓం ప్రకాష్, కృష్ణ పటేల్, డి.ఎస్.ఆర్.కె ప్రసాద్, బాబ్జి, సుధీర్, వినయ్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్ తదితర ప్రముఖులు, ఏఆర్‌పీ టీం సభ్యులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. దాదాపు 1300 మంది మహిళలు మరియు స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ ప్రతిభను నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. మహిళల సాధికారత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఇంత పెద్ద స్థాయిలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. మహిళలకు ప్రోత్సాహం అందించే కార్యక్రమాలు సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తాయని అన్నారు. అలాగే మియాపూర్ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంచిన ఉచిత అంబులెన్స్ సేవ అత్యవసర సమయాల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ, మహిళలు సమాజ అభివృద్ధికి పునాది అని, మహిళ సాధికారతే దేశ అభివృద్ధికి మార్గమని తెలిపారు. మహిళల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## అంజన్న ఆశీర్వాద యాత్ర విజయవంతం చేసిన బిజెపి శ్రేణులకు ధన్యవాదాలు

### పార్లమెంట్ కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు



కరీంనగర్,మార్చి15(వాయిస్ టుడే): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తలపెట్టిన కొండగట్టు అంజన్న ఆశీర్వాద యాత్ర కోసం భారీ ఎత్తున తరలివచ్చి ప్రోగ్రాంను విజయవంతం చేసిన కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ శ్రేణులు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పార్లమెంట్ కన్వీనర్,కరీంనగర్ డివిజన్ కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తెలిపారు.కరీంనగర్ మేయర్ పీఠం బిజెపికి అప్పగిస్తే కొండగట్టు అంజన్న స్వామి దర్శనానికి కాలినడకన వచ్చి మొక్కులు చెల్లించుకుంటాననీ మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ప్రకటించారు.ఈ మేరకు శనివారం రోజున అంజన్న ఆశీర్వాద యాత్రను కేంద్ర మంత్రి బండి సంజయ్ తో కలిసి పాదయాత్ర చేసిన బీజేపీ నుండి ఎన్నికైన వార్డు సభ్యులు,ఉపసర్పంచులు, సర్పంచులు, కౌన్సిలర్లు,కార్పొరేటర్ల లతో పాటు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని బిజెపి రాష్ట్ర,జిల్లా, మండల నాయకులకు,కార్యకర్తలకు, వివిధ మోర్చా బాధ్యులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.



## 54 డివిజన్లో ఘనంగా పోచమ్మ బోనాల వేడుకలు

కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ 54 డివిజన్లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు.డివిజన్లోని మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించారు.బోనాల కార్యక్రమం డివిజన్ ప్రముఖులు సుంచు శ్రీనివాస్ (డిష్) సుంచు అనిల్,జెల్లీ కోటేష్ సుంచు అరవింద్ సుంచు మల్లయ్య, సుంచు విద్యాసాగర్, వడ్లూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 54 డివిజన్ కార్పొరేటర్ గొట్టిముక్కుల ఉమారాణి వెంకటరమణ.కార్పొరేటర్ కల్లేపల్లి శారద.బాలరాజ్,డివిజన్ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# దేవుని పేరుతో రాజకీయం చేసినందుకే ఆగ్రహించిన కొండగట్టు అంజన్న

### బిజెపి శ్రేణులపై తేనె తీగల దాడి వెనుక ఉన్న మర్మం అదే

### బీఆర్ఎస్ ప్రభుత్వమే రాష్ట్రానికి డ్రగ్స్‌ను పరిచయం చేసింది

### సొంత చెల్లెలిని కేటీఆరే లిక్కర్ కేసులో ఇరికించారు

### పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం ఘాటు విమర్శలు



కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రజల బాగోగులను గాలికొదిలేసి, కేవలం దేవుడి పేరుతో రాజకీయం చేస్తున్నారని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మండిపడ్డారు. కరీంనగర్ ఆర్ అండ్ బి అతిథి గృహంలో కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ నేతలు దేవుడి పేరుతో పబ్బం గడుపుతున్నారు.దేశ ప్రధాని నుంచి కరీంనగర్ ఎంపీ,కేంద్ర మంత్రి బండి సంజయ్ వరకు రాముడు, హనుమంతుడు తప్ప మరో విషయం మాట్లాడటం లేదని విమర్శించారు. కొండగట్టు యాత్రకు వెళ్లిన బండి సంజయ్‌ను అంజన్న స్వామే అడ్డుకున్నారని,ఇక్కడ కూడా రాజకీయ లబ్ధి కోసమే యాత్ర చేశారు తప్ప కొండగట్టు అభివృద్ధి కోసం ప్రజల శ్రేయస్సు కోసము కాదని ఎద్దేవా చేశారు.బండి సంజయ్ వారి స్వార్థ రాజకీయాలకు దేవుడి పేరు వాడుకుంటున్నారని దేవున్ని రాజకీయాల్లోకి లాగడం పట్ల కొండగట్టు అంజన్న ఆగ్రహించడం వల్లనే తేనె తీగల దాడి జరిగిందని బిజెపి నేతలు భగవంతుని ఆగ్రహానికి లోనయ్యారని దుయ్యబట్టారు.బీజేపీ, ఆర్ఎస్ఎస్ పుట్టకముందు నుండే ప్రజలు దేవుళ్లను మొక్కుతున్నారని, ప్రజల విరాళాలతో నిర్మించిన అయోధ్య రామాలయంపై రాజకీయాలు చేసినందుకే అయోధ్యలో మోదీని ప్రజలు ఓడించారని గుర్తు చేశారు.యువతను డ్రగ్స్ కు బానిసలుగా చేసిన బిఆర్ఎస్,బిఆర్ఎస్ పాలనలో కోట్ల రూపాయల డ్రగ్స్ దందా నడిపిన కేటీఆర్.రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చిందని ఆరోపించారు.బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా విజృంభించిందని దేశ విదేశాలతో రహస్యంగా డ్రగ్స్ దందా నడిపిన కేటీఆర్ వేలకోట్ల రూపాయలు సంపాదించారు. రాష్ట్రంలోని యువతకు,సినీ పరిశ్రమకు కేటీఆర్ డ్రగ్స్ అలవాటు చేస్తే.. కరీంనగర్ యువతకు ఇక్కడి మాజీ మంత్రి డ్రగ్స్ అలవాటు చేశారని విమర్శించారు. అసలు రాష్ట్రంలోకి డ్రగ్స్‌ను తీసుకువచ్చిందే కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వమని ధ్వజమెత్తారు.సొంత చెల్లెలు కవిత ఆస్తిలో వాటా అడిగినందుకే కేటీఆర్ ఆమెను ఇంటి నుంచి బయటకు పంపారని సంచలన ఆరోపణలు చేశారు.కవితను లిక్కర్ కేసులో ఇరికించింది కేటీఆర్,హరీష్ రావులేనని,ఇప్పుడు మళ్లీ ఆమెకు సీబీఐ నోటీసులు రావడానికి కేటీఆరే కారణమని పేర్కొన్నారు.బిఆర్ఎస్ నేతలు కుటుంబ సభ్యుల మధ్య గొడవల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు,సొంత కూతురునే కాపాడుకోలేని కెసిఆర్ రాష్ట్ర ప్రజలను ఏమి కాపాడుతారని ధ్వజమెత్తారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి మరోచోట మెరుగైన స్థలం, వసతులు కల్పిస్తోందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్ మూర్ఖపు ఆరోపణలు చేస్తున్నారని,గత పదేళ్లలో ఆ ప్రజల కోసం మీరు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు సముద్రాల అజయ్,ఎర్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పాల్వంచ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎంపీ వద్దిరాజు ప్రత్యేక పూజలు

## రోడ్డు నిర్మాణానికి కోటి 50 లక్షల నిధులు ప్రకటింపు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వాయిస్ టుడే): పాల్వంచ శ్రీనివాసగిరిలో కొలువైన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆదివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించే భక్తులకు సరైన రహదారి లేకపోవడంతో రోడ్డు నిర్మాణానికి పార్టీ ఎంపీల ప్రత్యేక నిధుల నుంచి కోటి 50 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తనతో పాటు బీఆర్ఎస్ ఎంపీలు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, దీవకొండ దామోదర్‌రావుల నిధుల నుంచి తలో 50 లక్షల రూపాయల చొప్పున మొత్తం కోటిన్నర రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. అవసరమైతే మరో 50 లక్షల రూపాయలు కూడా విడుదల చేయించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఎంపీ రవిచంద్రకు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావుకు, ఆయన కుమారుడు రాఘవకు, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, కాపు సీతా మహాలక్ష్మీ తదితరులకు ఘన స్వాగతం పలికారు. అర్చకులు వారికి పూలమాలలు వేసి శాలువాలు, కండువాలతో సత్కరించారు. వేద పండితులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులురాజుగౌడ్, రంగనాథ్,శాంతి నాయక్ పాల్గొన్నారు.



## విశ్వకర్మ కార్పెంటర్ వెల్ఫేర్ సొసైటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

### ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల,మార్చి 15 (వాయిస్ టుడే) రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల పట్టణం లో నిర్వహించిన విశ్వకర్మ కార్పెంటర్ వెల్ఫేర్ సొసైటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథులు గా పాల్గొనగా, గౌరవ అతిథులు గా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి జిందం కళ చక్రపాణి పాల్గొన్నారు.ఈ సందర్భం గా నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియ జేసి వారిని ఘనంగా సన్మానించి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే,మహేందర్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, స్థానిక నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డికి సన్మానం



కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): కార్పొరేషన్ నగర అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ కార్పొరేటర్ సీఎం ముఖ్య సలహాదారులు,రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి ఆయన రాజ్యసభకు ఏకగ్రీవంగాఎన్నికైన సందర్భంగా హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థుల ఫీజు రీ ఎంబర్స్మెంట్ బకాయిల విడుదలకై పోరు దీక్షలో పాల్గొన్న జిల్లా బీసీ నాయకులు



కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): విద్యార్థుల ఫీజు రీ ఎంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పోరు దీక్షలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు సిరికొండ మధుసూదనాచారి,ఎల్ రమణ,మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మరియు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదలలో జాప్యం చేస్తూ వల్ల చదువులు కుంటుపడేల చేస్తుందని ఆవేదన చేశారు.ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వ బకాయిలు విడుదల చేయడం అని అనడం బాధ్యత రాహిత్యమని అలాంటప్పుడు గత ప్రభుత్వ పన్నుల బకాయిలను ఎందుకు వాడుకుంటున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అసెంబ్లీ మరియు శాసన మండలిలో బిఆర్ఎస్ తరుపున ఈ ఫీజు బకాయిలపై మాట్లాడుతామని నాయకు తెలిపారు.ఇప్పటికైనా బేషరతుగా విద్యార్థుల బకాయిలు 500 కోట్లు వెంటనే విడుదల చేయాలనిలేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అభివృద్ధిలో భాగస్వాములైన సిబ్బందికి పాలకవర్గం ఘన సన్మానం

### - గ్రామ ప్రగతిలో సిబ్బంది పాత్ర వెలకట్టలేనిది సమిష్టిగా సన్మానించిన గోవిందరావుపేట పంచాయతీ పాలకవర్గ సభ్యులు




కోనరావుపేట, మార్చి 15(వాయిస్ టుడే): గ్రామ వికాసంలో అహర్నిశలు శ్రమిస్తున్న పంచాయతీ సిబ్బంది సేవలను గుర్తించి, గౌరవించుకోవడం ఒక ఆదర్శవంతమైన సంప్రదాయమని గోవిందరావుపేట గ్రామ పాలకవర్గం చాటిచెప్పింది. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, ఉత్తమ సేవలందించిన ముగ్గురు సిబ్బందిని పాలకవర్గ సభ్యులందరూ కలిసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తిరుపతి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "మా గ్రామ ప్రగతి రథానికి ఈ సిబ్బందే చక్రాలు. పారిశుధ్యం నుంచి పరిపాలన వరకు వారు చూపిస్తున్న అంకితభావం వల్లే గోవిందరావుపేట ఆదర్శంగా నిలుస్తోంది. ఈ గౌరవం వారి బాధ్యతను మరింత పెంచుతుందని, ఇదే ఉత్సాహం భవిష్యత్తులోనూ కొనసాగాలని ఆశిస్తున్నాను" అని పేర్కొన్నారు. తమ శ్రమను గుర్తించి తగిన గౌరవం అందించినందుకు సిబ్బంది సర్పంచ్ కి ఉప సర్పంచ్ మరియు కమిటీ సభ్యులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ), వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొని సిబ్బందిని అభినందించారు.




## లైఫ్ లైన్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయం : డాక్టర్ కూరపాటి ప్రదీప్

ఖమ్మం , మార్చి 15 ( వాయిస్ టుడే): లైఫ్ లైన్ ఫౌండేషన్ నిరుపేదలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమనిప్రముఖ పిల్లల వైద్యులు, అభయ హాస్పిటల్ సీఈవో డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్.ఎస్. టీ రోడ్డు లో గల అంజుమ్ క్లినిక్ ఆవరణలో నిరుపేద ముస్లిం లకు లైఫ్ లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేస్తున్న రంజాన్ కిట్ల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని , మాట్లాడారు. తొలుత తన చేతుల మీదుగా నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ లైఫ్ లైన్ పౌండేషన్ ఏర్పాటు చేసి ,ఇటువంటి సేవా దృక్పథంతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ ముందుండాలని ఆయన ఆకాంక్షించారు. సమాజంలో ఇటువంటి సంస్థల అవసరం ఎంతైనా ఉందని, ఫౌండేషన్ చేసే ప్రతి మంచి పనికి తన వంతు సహాయం ,సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా లైఫ్ లైన్ ఫౌండేషన్ సభ్యులు , మిత్రబృందం డాక్టర్ కూరపాటి ప్రదీప్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ లైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ . జానీ మియా వారి మిత్ర బృందం షేక్ .ఇమ్రాన్ , డాక్టర్. మొహమ్మద్ అల్తాఫ్ , షేక్. మన్సూర్ అలీ , యం డి. రహీం , మీరాజోదన్ , యం డి. ఆసిఫ్ , మహమ్మద్ ఖదీర్ , సుభాన్ తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వాయిస్ టుడే): చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ నాయక్ తండ్రి చందా నాయక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. ఆదివారం రాత్రి శ్రీకాంత్ నివాసానికి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి తమ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావుకు ఫోన్ చేసి సర్పంచ్ శ్రీకాంత్ నాయక్‌తో మాట్లాడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ శ్రీకాంత్ నాయక్ మనోధైర్యంతో ఉండాలని సూచిస్తూ, త్వరలో కొత్తగూడెం వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని తెలిపారు. అలాగే మీ కుటుంబానికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, చుంచుపల్లి మాజీ ఎంపీపీ శాంతి నాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో ఉన్న అన్వర్ పాషాను పరామర్శించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వాయిస్ టుడే): రామవరంకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మహ్మద్ హుస్సేన్ తమ్ముడు అన్వర్ పాషా కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆదివారం సాయంత్రం ఆయనను పరామర్శించారు. రామవరంలోని పాషా నివాసానికి వెళ్లిన ఎంపీ రవిచంద్ర, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పాషాకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. త్వరగా కోలుకుని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి రంజాన్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గోనెల విజయలక్ష్మీకి ఎంపీ వద్దిరాజు ఘన నివాళులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వాయిస్ టుడే) : ఉమ్మడి ఖమ్మం జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గోనెల విజయలక్ష్మీ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆమె దశదిన కర్మకాండ కార్యక్రమం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరై స్వర్గీయ విజయలక్ష్మీ చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. అలాగే దివంగత నాయకురాలు విజయలక్ష్మీ కూతురు ఆకుల కరుణ, అల్లుడు రవి మరియు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, కాపు సీతామహాలక్ష్మీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## పాల్వంచలో ఇఫ్తార్ విందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర హాజరు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వాయిస్ టుడే): పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా పాల్వంచలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాల్వంచ నటరాజ్ చౌరస్తా వద్ద ఉన్న జామా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందుకు విచ్చేసిన ఎంపీ రవిచంద్ర, వనమా రాఘవలను స్థానిక ముస్లిం మత పెద్దలు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకుడు మల్లెల రవిచంద్ర, ఆయన సతీమణి, 37వ డివిజన్ కార్పొరేటర్ స్వప్న కుమారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందుకు సుమారు వెయ్యి మంది ముస్లిం సోదరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం పరస్పర సౌభ్రాతృత్వం, ప్రేమ, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
సోమవారం 16 మార్చి 2026

# ఎమ్మెల్యే సాయిల్ వ్యాఖ్యలను ఎస్సీ సెల్ ఛైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమర్థిస్తున్నారా...?

**వేద పండితుల ఆశీర్వచన మంత్రాలకు,బూతులకు తేడా తెల్వదా కవ్వంపల్లి...?**

**అసలైన దళిత వ్యతిరేక పార్టీ కాంగ్రెస్**

**దళితులకు సముచిత స్థానం ఇచ్చి గౌరవించిన పార్టీ బిజెపి**

**కులాలు,మతాల మధ్య చిచ్చు పెట్టే నైజం కాంగ్రెస్కే ఉంది**

**ఓ మతాన్ని ఎత్తుకోవడం ఓ మతాన్ని కించపరచడం కాంగ్రెస్ అలవాటయింది.**

**బిజెపి దళిత మోర్చా అధ్యక్షులు, కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్**



కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కవ్వంపల్లి సత్యనారాయణ నియమితులైన సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభలో వేద బ్రాహ్మణులు ఆశీర్వచనం ఇస్తే అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సామేల్ ను సమర్థించడానికి కవ్వంపల్లి సత్యనారాయణకి సిగ్గుండాలని బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు,కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కరీంనగర్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమిడి వేణు ప్రసాద్ మాట్లాడుతూ వేద బ్రాహ్మణులు ఆశీర్వచనం ఇస్తే ఎమ్మెల్యే సామెల్ నోటి దూలతో అనవసర వ్యాఖ్యలు చేశారని,ఆ వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాల్సింది పోయి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బిజెపి,కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ పై అనవసర వ్యాఖ్యలు చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే శామ్యూల్ వ్యాఖ్యలను ఖండించాల్సిన కవ్వంపల్లి సత్యనారాయణ ఆయన వ్యాఖ్యలను సమర్థిస్తూ వెనుకేసుకోవచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఫైర్ అయ్యారు. బ్రాహ్మణ పార్టీ బిజెపి అని,దళిత వ్యతిరేక పార్టీ బిజెపి అని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిచ్చి కూతలు కూస్తున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.దళితుల పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరు, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పట్ల కాంగ్రెస్ చేసిన రాజకీయం దేశం మొత్తానికి తెలుసన్నారు.అంబేద్కర్ ను గౌరవించిన చరిత్ర,దళితున్ని రాష్ట్రపతి చేసిన చరిత్ర కేవలం బిజెపికే ఉందన్నారు.బిజెపి అన్ని కులాలకు,మతాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడంతోనే దేశాన్ని ఏలుతుందని,ఆ దిశలోనే మోడీ ప్రభుత్వం విజయవంతంగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు.విభజించి, పాలించడం, కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టడం తోనే కాంగ్రెస్ దేశంలో కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిన, ఇంకా కాంగ్రెస్ నేతలకు బుద్ధి రావడం లేదన్నారు.నిన్నటి రోజున

సనాతన ధర్మం,వేద బ్రాహ్మణులను ఎమ్మెల్యే సామెల్ కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తే కనీసం క్షమాపణ చెప్పే పరిస్థితుల్లో కూడా కాంగ్రెస్ నేతలు లేరని ఆయన దుయ్యబట్టారు.రాష్ట్రంలో కాంగ్రెస్ కులాలు,మతాల మధ్య చిచ్చు పెట్టడానికి మళ్లీ అనేక రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు.ఓవర్గం మెప్పుకోసం స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పేరు రేవంత్ ఉద్దీన్ అని పిలిచిన నష్టం లేదని చెప్పుకునే దౌర్భాగ్యస్థితికి కాంగ్రెస్ వచ్చిందని, ఓవర్గం ఓట్ల కోసం,మెప్పు కోసం కాంగ్రెస్ పాకులాడుతుందని ఘాటుగా విమర్శించారు. హిందూ సనాతన ధర్మాన్ని, వేద పండితులను కించపరిచే హక్కు అసలు కాంగ్రెస్కు ఎవరిచ్చారు..? ఎమ్మెల్యే సామెల్ వ్యాఖ్యలను సమర్ధిస్తున్నారా..? లేక వ్యతిరేకిస్తున్నారా అనే విషయంపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లు సోమిడి వేణు ప్రసాద్, పొన్నం మండన్నా,మాసం గణేష్, మ్యాకల వెంకటేష్,జాడి బాలరెడ్డి, పాల్గొన్నారు.



## బహుజన రాజకీయ ఉద్యమ శిల్పిగా పేరు పొందిన మాన్య శ్రీ కాన్షీరాం

**దేశ పార్లమెంట్ భవనం లో సబ్బండ కులాలు అడుగులు వేయించిన నాయకుడు కాన్షీరాం**

**భారతదేశ రాజకీయ చరిత్ర లో విస్మరించబడిన బహుజన కులాలకు స్థానం కల్పించిన రాజకీయ దురంధరుడు కాన్షీరాం**

సిరిసిల్ల, మార్చి 15 (వాయిస్ టుడే) బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్య శ్రీ కాన్షీరాం జయంతి కార్యక్రమం. స్థానిక సిరిసిల్ల పాత బస్టాండ్ లోని సంజీవయ్య విగ్రహం నందు దళిత సంఘాల నాయకులు రాగుల రాములు ఆధ్వర్యం లో ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 26 వ వార్డు కౌన్సిలర్ నెల్లుట్ల నరేష్, ముఖ్య అతిథి గా విచ్చేశారు.మొదట గా భారత రత్న బాబాసాహెబ్ అంబేద్కర్, కాన్షీరాం చిత్రపటాల కు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు.మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు మాట్లాడుతూ, రాజ్యాధికారానికి దూరం గా ఉన్నటు వంటి అనేక కులాలను దగ్గర కు చేర్చుకొని బహుజన కులాలు గా మార్చి అధికారపు సింహాసనం మీద కూర్చోబెట్టిన గొప్ప రాజకీయ ఉద్యమ శిల్పి మాన్య శ్రీ కాన్షీరాం అన్నారు. రాజ కీయ అధికారమే సామాజిక మార్పు కు మాస్టర్ కి అనే మహత్తర ఆలోచన తో దేశ వ్యాప్తంగా దళితుల ను ఆది వాసీ లను ఇతర వెనుకబడిన వర్గాల ను మరియు మైనార్టీలను ఒకే బహుజన శక్తి గా ఏకం చేయడానికి తన జీవితా న్ని అంకితం చేశారని అన్నారు.నేటి బహుజన యువత కాన్షీరాం జీవితా న్ని స్ఫూర్తిగా తీసుకొని రాజ్యాధికార పోరాటం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమం లో మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, 26 వ వార్డు కౌన్సిలర్ నెల్లుట్ల నరేష్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆకునూరి బాలరాజు, అబ్దుల్ రషీద్, కమర్, స్థానిక నాయకులు, స్థానిక మహిళలు, పలు కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌లో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి



ఖమ్మం మార్చి 15 (వాయిస్ టుడే): ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర సాధన కోసం 58 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన మహా పురుషులు పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల హృదయాలలో అమరజీవి గా నిలిచిపోయారని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి. సూర్యనారాయణ పేర్కొన్నారు. ఇల్లందు లోని విజ్ఞాన్ విద్యాసంస్థలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సూర్యనారాయణ మాట్లాడుతూ గాంధేయవాదిగా, స్వాతంత్ర్య సమరయోధునిగా పొట్టి శ్రీరాములు దళితోద్ధారణకు కృషి చేశారని అన్నారు. మద్రాసు ప్రెసిడెన్సీ నుండి తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చేస్తూ చేసిన త్యాగంతో 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస మార్గాలలో ఆయన పయనించారని, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని పలుమార్లు జైలుశిక్ష అనుభవించారని తెలిపారు. పొట్టి శ్రీరాములు సమాజ సేవలో కీలకపాత్ర పోషించారని గాంధీజీ ఆశ్రమంలో చేరి హరిజనోద్ధరణ, ఖాదీ ప్రచారం కోసం కృషి చేశారని , నెల్లూరులో దళితుల దేవాలయ ప్రవేశం కోసం నిరాహార దీక్షలు చేశారని వివరించారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జన్మించారని ముంబైలో ఇంజనీరింగ్ పూర్తి చేశారని పేర్కొంటూ మద్రాస్ కేంద్రంగా ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ నుండి తెలుగు వారి కోసం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని 1952 అక్టోబర్ 19 తేదీన నిరాహార దీక్ష ప్రారంభించారని 58 రోజుల్లో సుదీర్ఘ దీక్ష అనంతరం 1952 డిసెంబర్, 15వ తేదీన ఆత్మబలిదానం చేసారని అన్నారు. ఆయన మరణానంతరం జరిగిన ప్రజా నిరసనలతో అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 'ఆంధ్ర రాష్ట్ర' ఏర్పాటును ప్రకటించారని తద్వారా భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొదటి రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్, 1వ తేదీన అవతరించిందని తెలుపుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనలో ఆయన చేసిన త్యాగానికి తెలుగు ప్రజలు ఆయనను "అమరజీవి" గా గౌరవించుకుంటారని తెలిపారు.



## మున్సిపల్ ఛైర్మన్‌ను సన్మానించిన గ్రామీణవైద్యుల సంఘం

తొర్రూరు, మార్చి 15 వాయిస్ టుడే : తొర్రూరు పట్టణ అభివృద్ధికి పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తానని తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆర్ఎంపీ పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్ ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ ఎల్లవేళలా పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటూ పట్టణాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఉన్నత మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంతోపాటు పట్టణ ప్రజల సమస్యలలో తమ్ముడిలా వ్యవహరిస్తూ ప్రతి ఒక్కరి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఆర్.ఎం.పి పి.ఎం.పి లకు ప్రభుత్వ గుర్తింపును ఇవ్వాలని మీరు చేసిన సూచనలను మీ సమస్యను కూడా ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి చెప్పి ప్రభుత్వం దృష్టికి చేరవేసేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గం వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి, తొర్రూరు మండల అధ్యక్షులు ధర్మారపు హనుమంతు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మనబోయిన యాకయ్య, కోశాధికారి గద్దల వెంకటేష్, సభ్యులు మహంకాళి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## తొర్రూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా మున్సిపల్ ఛైర్మన్ తూనం శ్రావణ్ కుమార్



తొర్రూరు, మార్చి 15 వాయిస్ టుడే : తొర్రూరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని తొర్రూరు మున్సిపల్ ఛైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ తో కలిసి స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులలో జరుగుతున్న మురికి కాల్వ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఛైర్మన్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కారం చేస్తామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిల సహకారంతో నిధులు మంజూరు చేయించి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో డ్రైనేజీ,మంచినీటి, సిసి రోడ్డు లాంటి సమస్య లేకుండా కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరు సమన్వయంతో పట్టణ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నల్లపు రాజు, చీకటి రమేష్, అరుణ్ కుమార్, రాజు, వెంకన్న, సాయి,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




## మృతుని కుటుంభానికి బియ్యం అందజేత

తొర్రూరు, మార్చి 15 వాయిస్ టుడే : మండలంలోని గుర్తురు గ్రామానికి చెందిన గుడివాడ సోమయ్య ఇటీవల మృతి చెందడంతో తోటి స్నేహితులు వారి కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేసి,ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు సంయుక్తంగా మాట్లాడుతూ సోమయ్య అకాల మరణం బాధాకరమన్నారు. ఆయన మన మధ్యన లేకపోవడం చాలా బాధాకరమని,వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆపద సమయంలోనైనా తోడుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో గుడివాడ శివకుమార్,పిల్లి నాగరాజు వడ్లకొండ రాంబాబు,పెంట సుధాకర్,పెందోట కిషన్ రావు, వడ్లకొండ యకాబ్రం,మెరుగు రాజేష్ గౌడ్,తోకల కృష్ణమూర్తి, సింగరం మధు,గుద్దేటి యాకన్న, కూరపాటి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో భారీ సైబర్ క్రైమ్ ముఠా గుట్టురట్టు

## 12 మంది నిందితుల అరెస్ట్




కరీంనగర్,మార్చి 15(వాయిస్ టుడే): జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కరీంనగర్ పోలీసులు చేపట్టిన "ఆపరేషన్ క్రాక్‌డౌన్" లో భాగంగా ఒక భారీ వ్యవస్థీకృత నేర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సైబర్ మోసాలకు కీలకమైన "మ్యూల్ బ్యాంక్ ఖాతాలను"సృష్టించి సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారితో సహా 12 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.నేర విధానం కరీంనగర్–II టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని క్రిమినల్ చట్టాల ప్రకారం కేసు నమోదు చేసిన అనంతరం దర్యాప్తులో భాగంగా ఈ ముఠా ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు అమాయక వ్యక్తుల పేరుతో లేదా స్వయంగా వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్ మరియు కరెంట్ ఖాతాలను తెరిచేవారు. ఆ ఖాతాలకు సంబంధించిన పాస్‌బుక్స్, ఏటీఎం కార్డులు,మరియు సిమ్ కార్డులను పైస్థాయి సైబర్ నేరగాళ్లకు విక్రయించేవారు.ఈ ఖాతాల ద్వారా సైబర్ మోసాలకు గురైన బాధితుల డబ్బును చేతులు మార్చడం మరియు ఉపసంహరించుకోవడం చేసేవారని సీపీ గౌస్ ఆలం తెలిపారు. సుదీర్ఘ దర్యాప్తు అనంతరం పోలీసులు ప్రధాన నిర్వాహకుడు రాజేశ్వర్ రెడ్డితో పాటు కరీంనగర్‌కు చెందిన మరో 11 మంది సహచరులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టు అయిన వారు:

1) ముదుగుంటి రాజేశ్వర్ రెడ్డి, తండ్రి: శ్రీనివాస్ రెడ్డి, వయస్సు: 22 భగత్‌నగర్,కరీంనగర్.2) నందగిరి సాయి వర్ధన్,తండ్రి: ఈశ్వరాచారి, వయస్సు: 22 కిసాన్‌నగర్, కరీంనగర్. 3) కాలిదాస్ కౌశిక్, తండ్రి: కన్నయ్య, వయస్సు: 23 ధోబీవాడ, కరీంనగర్. 4) ములంకుల రాజ్‌కుమార్,తండ్రి: కంకయ్య, వయస్సు: 23 కట్టరంపూర్, కరీంనగర్.5) బండి సాయి కృష్ణ, తండ్రి: సదయ్య, వయస్సు: 26 కన్నాపూర్, శంకరపట్నం మండలం. 6) అడవెల్లి సాయి కార్తీక్, తండ్రి: కుమార్, వయస్సు: 23 విద్యానగర్, కరీంనగర్.7) మీర్ జామీ ఉద్దీన్, తండ్రి: మీర్ జాకీ ఉద్దీన్, వయస్సు: 22 స్వరణ్ స్ట్రీట్, కరీంనగర్.8) మహమ్మద్ జవాద్ ఖాన్, తండ్రి: మహమ్మద్ సాజిద్ ఖాన్, వయస్సు: 23 స్వరణ్ స్ట్రీట్,కరీంనగర్.9) సర్దార్ దల్జీత్ సింగ్, తండ్రి: సర్దార్ గోవింద్ సింగ్, వయస్సు: 23 నివాసం: కోతిరాంపూర్,కరీంనగర్.10) పల్లెర్ల అజయ్, తండ్రి: రాజు,వయస్సు: 24 వెంకట్రావుపల్లి,లక్ష్మీపూర్, రామడుగు 11) నిర్మల్ల శివ, తండ్రి: శ్రీనివాస్, వయస్సు: 23, మారుతినగర్, కరీంనగర్.12) దిద్దీ సాయి చరణ్, తండ్రి:నాగరాజు,వయస్సు: 22 రుక్మాపూర్,చొప్పదండి మండలం.

ఈ ముఠా సభ్యులు కేవలం ఒక్క కేసులోనే కాకుండా, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని ఇతర కేసులలో ఈ నిందితులు పట్టణంలోని వివిధ స్టేషన్ స్థాయిలో కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు.వీరి వద్ద నుండి కీలక పత్రాలు,బ్యాంక్ కిట్లు మరియు ఇతర సాక్ష్యాలను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు.వీటిపై

### "ఆపరేషన్ క్రాక్‌డౌన్"

మరింత దర్యాప్తు కొనసాగుతోందని సీపీ తెలిపారు. సమర్ధవంతంగా పనిచేసి ఈ అంతరాష్ట్ర ముఠాను పట్టుకున్న కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి,ఎస్సైలు శ్రీనాథ్, పోచయ్య,సైబర్ క్రైమ్ ఎస్సై అనిల్,కానిస్టేబుల్ అనిల్,సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ నుండి వసీం,ఖాజా పాషా,రవి, వెంకటేష్,టూ మరియు త్రి టౌన్ లకు చెందిన హెడ్ కానిస్టేబుల్ కృష్ణా రెడ్డి ,శ్రీనివాస్, శంకర్, లక్ష్మణ్, పోలీసు కానిస్టేబుళ్లు సాయి కృష్ణ, అభినవ్ పోలీస్ అధికారులను, సిబ్బందిని,కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు.తెలియని వ్యక్తులకు మీ బ్యాంక్ ఖాతాలు ఇవ్వడం, ఇతరుల కోసం అకౌంట్లు తెరవడం లేదా మీ ఏటీఎం కార్డులు,సిమ్ కార్డులు ఇతరులకు అప్పగించడం చట్టరీత్యా నేరం.ఇలా చేయడం వల్ల మీరు కూడా సైబర్ నేరాలలో భాగస్వాములు అవుతారని,కఠిన చట్టపరమైన చర్యలు ఉంటాయని కరీంనగర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# నేనున్నా..ఎవరు అధైర్యపడొద్దు

**కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి**

**కాజీపేట బూడిదగడ్డలో పర్యటన.. వరద ముంపు ప్రాంత ప్రజలతో మాటామంతీ**

**అభివృద్ధి పనులకు త్వరలో ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన**

**ఇందిరమ్మ ఇండ్లు,డబుల్ బెడ్ రూం మంజూరులో దళారులను నమ్మొద్దు..**

**ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ..**



కాజీపేట, వాయిస్ టుడే: "మీకు నేను ఉన్నాను.. ఎవరు కూడా అధైర్యపడొద్దు" అని కాంగ్రెస్ యువ నాయకుడు, వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. రానున్న వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలల్లో భాగంగా ఆదివారం కాజీపేట 47వ డివిజన్ లోని వరదముంపు ప్రాంతమైన బూడిదగడ్డను స్థానికులతో కలిసి విష్ణువర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతీయేట వర్షాకాలంలో వచ్చే వరదల కారణంగా నీటమునిగే ఇండ్లలోకి ఆయన స్వయంగా వెళ్లి పరిశీలించి వరదల వలన జరిగే నష్టాలను అక్కడి స్థానికులతో కలిసి చర్చించారు. రోడ్లు,డ్రైనేజీ లను పరిశీలించిన అనంతరం ఆయన అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ పదేళ్లుగా గత ప్రభుత్వం బూడిదగడ్డ ప్రాంతాన్ని పట్టించుకోకుండా విమర్శించిదన్నారు. భారీ వర్షాలతో వరదనీరు ఇండ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఏ ఒక్క నాయకుడు వచ్చి పరామర్శించిన పాపాన పోలేదని,ఆ పరిస్థితులను స్థానికులు స్వయంగా వివరించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ప్రాంతంలోని వరదనీరు బయటకు పోవాలంటే రైల్వే అధికారులతో మాట్లాడి డ్రైనేజీ వెడల్పును పెంచాల్సిన అవసరం ఉందని,ఈ విషయాన్ని వెంటనే ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇన్ని సంవత్సరాలుగా ఇంత పెద్దసమస్యను పరిష్కరించడంలో నాటి ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. బూడిదగడ్డ ప్రాంతం అభివృద్ధి కోసం నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్వయంగా వచ్చి శంకుస్థాపన చేస్తారని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.

**దళారులను నమొద్దు..**

ఇందిరమ్మ ఇండ్లు మరియు డబుల్ బెడ్ రూమ్ మంజూరు విషయంలో ఎవరు కూడా దళారులను నమ్మి మోసపోవద్దని విష్ణువర్ధన్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఇందిరమ్మ ఇండ్లు,డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయిస్తామని లేదా తామే మంజూరు చేయించామని డబ్బులు అడిగితే ఎవరికి వెంటనే స్థానిక ఎమ్మెల్యే దృష్టికి లేదా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వంపై చెడ్డపేరు తీసుకువస్తే వారు ఎంతటి వారైనా సరే సహించేది లేదన్నారు. 'ఇది ప్రజా ప్రభుత్వం అని.. కమీషన్ల ప్రభుత్వం కాదని' ఇది ప్రతీ ఒక్కరూ గమనించాలని,ఎవరైనా ప్రజల నుండి డబ్బులు వసూళ్లు చేసినట్టు తెలిస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని విష్ణువర్ధన్ రెడ్డి హెచ్చరించారు. ఈ పర్యటనలో స్థానిక డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్,నాయకులు ఇప్ప శ్రీకాంత్, దేవయ్య, సిరిల్ లారెన్స్,నగేష్,బర్ల రాజ్ కుమార్,తిరుపతి శ్రీనివాస్, రశీద్, వంశీ, దయాకర్,స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## మాన్యవర్ కాన్షీరాం గారికి వెంటనే భారతరత్న అవార్డు ప్రకటించాలి

**అడ్వకేట్ జగన్ మోహన్ జిల్లా అధ్యక్షులు నిర్మల్**

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 15: బహుజన్ సమాజ్ పార్టీ ఖానాపూర్ నియోజక వర్గం ఇంచార్జ్ జోసఫ్ గంగారం ఆధ్వర్యంలో మాన్య శ్రీ కాన్షీరాం 92 వ జయంతి కడం మండల కేంద్రము లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నిర్మల్ జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ జగన్ మోహన్ హాజరై కాన్షీరాం చిత్ర పటానికి పూలతో నివాళి అర్పించి అడ్వకేట్ జగన్ మోహన్ మాట్లాడుతూ... మాన్యవర్ కాన్సిరాం కి భారత రత్న అవార్డు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు దేశంలో బహుజనులకు రాజ్యాధికారం రుచి చూపించిన మహనీయుడు మాన్య శ్రీ కాన్షీరాం వారి ఆశయాలను సాధనలో ప్రతి ఒక్క బీఎస్పీ నాయకుడు పని చేయాలని..ఈ భారత దేశంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ,మత మైనారిటీలను రాజ్యాధికారం దిశగా అడుగులు వేయించి, రాజ్యాధికారం రుచి చూపించిన గొప్ప మహనీయులు మాన్యవార్ కాన్షీరాం గారు అని..ఎవ్వరి జనాభా ఎంతో వారికి అంత వాటా కావాలి అని చెప్పిన వ్యక్తి అణగారిన వర్గాల్లో 'మేము కూడా పాలకులం కాగలం' అనే ఆత్మవిశ్వాసాన్ని నింపిన మహనీయులు అని..."ఓటు మనది – రాజ్యాధికారం మనది" అనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.కాన్షీరామ్ తన జీవితాంతం పెళ్లి చేసుకోకుండా, సొంత ఆస్తిని కూడబెట్టుకోకుండా, తన కుటుంబంతో సంబంధాలను వదులుకుని కేవలం సమాజం కోసమే బతికారు. 85% ఉన్న బహుజనుల ఓట్లతో అధికారంలో వెళ్లిన అగ్రవర్ణాలు బహుజనులను బానిసలుగా చేసే కుట్రలు జరుగుతున్నాయని బెహన్ కుమారి మాయావతి నాయకత్వంలో బీఎస్పీ నాయకులు కార్యకర్తలు బహుజనులకు రాజ్యాధికారం దిశగా పని చేస్తాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిల ఇంచార్జ్ లక్ష్మీ యాదవ్,నియోజకవర్గం ఇంచార్జ్ జోసఫ్ గంగారం, ప్రదాన కార్యదర్శి తుడిచర్ల సంజయ్,జరి త్రిషరన్,కడం సీనియర్ నాయకులు లక్ష్మణ్ కుమార్, నరసయ్య జాలిగామ, గుడికందుల నరసయ్య..దుబ్బాక రాజ్ కుమార్, కూచన్ పల్లి ఆకాష్,జాడి పవన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు...



## నిర్మల్ మండల్ రానాపూర్ గ్రామంలో వండర్ ల్యాండ్ ప్రారంభ కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 15: నిర్మల్ జిల్లా నిర్మల్ మండలం రాణాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వండర్ ల్యాండ్ ను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ, పిల్లలు మరియు కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపేలా ఈ వండర్ ల్యాండ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఇలాంటి వినోద కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో ఉండడం వల్ల ప్రజలకు వినోదంతో పాటు ప్రాంత అభివృద్ధికి కూడా దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అల్లోల మురళీధర్ రెడ్డి ప్రముఖ పారిశ్రామికవేత్త, అల్లోల సురేందర్ రెడ్డి,పాకాల రామచందర్ పాకాల ఫౌండేషన్ చైర్మన్, పతి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి మాజీ జెడ్పీటీసీ, మహిపాల్ రెడ్డి మాజీ ఎంపీపీ, పీవీ రమణ రెడ్డి మాజీ పి ఏ సి స్ చైర్మన్, శ్రీనివాస్ పి ఏ, ఇంద్రకరణ్ రెడ్డి సర్పంచ్ , గంగారెడ్డి మాజీ సర్పంచ్, అనుముల భాస్కర్, వినయ్, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వండర్ ఆల్ లోని వివిధ ఆటలు, సౌకర్యాలను మాజీ మంత్రి పరిశీలించారు.

## మార్నింగ్ వాక్ దీర్ఘకాలిక వ్యాదులనుండి రక్షణ కలిగిస్తుంది

**మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి**



నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 15: మార్నింగ్ వాక్ దీర్ఘకాలిక వాదులనుండి రక్షణ కలిగిస్తుంద మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ;కళాశాలలో వాకింగ్ అండ్ లాఫింగ్ అసోసియేషన్ వారి ఆహ్వానం మేరకు వారితో కలిసి మార్కింగ్ వాక్ లో పాల్గొన్నారు. వైస్ చైర్మన్ గా ఎన్నికై మొదటి సారి రావడంతో గణేష్ చక్రవర్తిని శాలువా లతో సత్కరించి పూల బోకెలు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ మార్నిగ్ వాక్ వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. బరువు తగ్గడాన్ని వేగవంతం చేస్తుందని , శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుందని మానసిక స్థితి మరియు జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుందన్నారు. మార్కింగ్ వాక్ నిర్వకులకు కావలసిన అవసరాలపై అసోసియేషన్ సభ్యులు విన్నవించడంతో. అతి త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నాలం శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ భీమ సురేందర్, వైస్ ప్రెసిడెంట్ సనుగుల దేవిదాస్, జాయింట్ సెక్రటరీ అనగందుల రాజు, క్యాషియర్ శంకర్ గౌడ్, ఫౌండర్ ప్రెసిడెంట్ పి. దేవేందర్ రెడ్డి ఈ,సి మెంబెర్స్, మునిందర్ రెడ్డి, పోడెల్లి బాపు, కిష్ట రెడ్డి , కే వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



## భైంసా పట్టణంలో డాక్టర్ కాశీనాథ్ నూతన మమత క్లినిక్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమం

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 15: భైంసా పట్టణంలో డాక్టర్ కాశీనాథ్ నూతన మమతా క్లినిక్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ హాజరై రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భైంసా ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఇలాంటి ఆధునిక వైద్యసదుపాయాలు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు దగ్గరలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం అభినందనీయమని అన్నారు.డాక్టర్ కాశీనాథ్ మాట్లాడుతూ మమతా క్లినిక్ ద్వారా సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోళ్ళ దత్తు మరియు వార్డు కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రముఖులు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




## ముస్లింల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి**

తొర్రూరు , మార్చి 15 వాయిస్ టుడే : తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కేంద్రానికి చెందిన జమా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని, టిపిసిసి ఉపాధ్యక్షురాలు అనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి,బొకేలు అందించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమాన్ని గత ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని తెలుపుతూ మైనార్టీల సంక్షేమం కొరకు కృషి చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొంటూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింల అభివృద్ధి కోసం విద్యా,వైద్య, ఉద్యోగ రంగాలలో 4 శాతం రిజర్వేషన్లను కల్పించి ముస్లింల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవడానికి కృషి చేయడం జరిగిందని, సబ్బండ వర్గాల సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జమా మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ అలీమ్, ఉపాధ్యక్షులు మహమ్మద్ మౌలానా పాషా,మహ్మద్ షబ్బీర్ అలీ,ప్రధాన కార్యదర్శి మహ్మద్ అమీర్, కోశాధికారి మహమ్మద్ గౌస్ మైనోద్దీన్, సహాయ కార్యదర్శులు మమ్మద్ యాకుబ్ పాషా,ఎస్డి చాంద్ పాషా, మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జలీల్,కమిటీ సభ్యులు మహమ్మద్ సలాం పాషా, మహమ్మద్ అమీనుల్ ఇస్లాం, ముస్లిం మత పెద్దలు మహమ్మద్ నదీమ్, మహమ్మద్ అఫ్జల్, మహమ్మద్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నిలబెట్టుకున్న మధుర సర్పంచ్ నవీన్ గౌడ్

**మధుర గ్రామానికి చెందిన వెంకట నీలమ్మ భూమయ్య కూతురిని వారికి పదివేల16 రూపాయలు అందజేసిన సర్పంచ్ నవీన్ గౌడ్**

నర్సాపూర్ (వాయిస్ టుడే): హత్నూర మండల పరిధిలోని మధుర గ్రామంలో గత సర్పంచ్ ఎన్నికల్లో ఆడపిల్ల వివాహానికి 10116 నగదు గ్రామంలో ప్రతి ఆడపిల్లవానికి అందజేస్తానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చినందుకు హామీని నేడు మాధుర గ్రామానికి చెందిన వెంకట గారి నీలమ్మ భూమయ్య గారి కూతురు వారికి పదివేల16 రూపాయలు ఇవ్వడం జరిగిందని మాధుర సర్పంచ్ నవీన్ గౌడ్ తెలిపారు అంతేగాకుండా రాబోయే రోజుల్లో గ్రామాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని నవీన్ గౌడ్ తెలిపారు.

## ప్రజా ఐక్యత గీతం



పర్వత శిఖరములపై పలికిన కవితా నాదమది
పృథ్వీ గర్భమంతట పరిమళించి విరజిల్లె
భాషల గోడలన్నియు భగ్నమగునని బోధించి
భావాల సేతువై మానవ హృదయములను కలిపె.
కులమత భేదముల కలుషిత చీకటిలో
కరుణా కాంతిరేఖలై కవిత వెలుగె;
విభేద వలయముల విరిచి సమత్వ మార్గమున
సామరస్య సుగంధమై సమాజమున పరచె.
పేదవాని నిశ్వాసము,ధనవాని గర్వగీతము
ఒకే రాగమై కలిసిన క్షణమున
సమానత్వ సత్యమై సమాజ గర్భమందు
స్నేహ స్వరమై సర్వలోకమున మార్మోగె.
సరిహద్దు రేఖలతో భూమిని చీల్చిన చేతులకన్నా
స్నేహసూత్రమే శాశ్వతమని కాలమే చెప్తుంది
మనసుల నదులన్నియు ఒకే సముద్రమై చేరగా
మానవత్వమే జగతికి మహాసంగీతమవుతుంది.
కావున కవిత కేవలం పదాల అలంకారముకాదు
ప్రజల హృదయాలను కలిపే పవిత్ర జ్యోతి అది
ప్రపంచ కవితా స్వరమై మార్మోగిన వేళ
ప్రజల ఐక్యత రాగమే భూమికి శాశ్వత గీతమవుతుంది.

**రచన: మంజుల పత్తిపాటి**
**యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ రాష్ట్రం**
**చరవాణి : 9347042218**

## మల్టీ పర్పస్ వర్కర్లకు సన్మానించిన సర్పంచ్ ప్రియాంక రాజేందర్



ఝరాసంగం(వాయిస్ టుడే): మార్చ్15 కోహీర్ మండల గురుజువాడ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాల భాగంగా మల్టీ పర్పస్ వర్కర్లను గ్రామ సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు.వారికి శానిటైజేషన్ కిట్‌ను అందజేశారు. గ్రామ ప్రజలకు సేవలందిస్తూ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వారిని శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి వారు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్, ఉప సర్పంచ్ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
సోమవారం 16 మార్చి 2026



## హైదరాబాద్ ఇఫ్తార్ విందులో పాల్గొన్న నిర్మల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్

నిర్మల్ జిల్లా ప్రతినిధి వాయిస్ టుడే మార్చ్ 15: హైదరాబాద్ నగరంలోని ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం ఘనంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇఫ్తార్ విందు వేడుకలో నిర్మల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమాంద్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫహీం కుర్రేది (టి ఎం ర్ ఈ ఐ స్) వైస్ చైర్మన్ మరియు ప్రెసిడెంట్ తో కలిసి ఆయన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని కలిసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రముఖులు కూడా పాల్గొన్నారు.



## మంచరామి గ్రామంలో వైభవంగా పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-15 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండలం మంచరామి గ్రామంలో పోచమ్మ బోనాలు గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి తిరుపతి ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలు వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ బోనాలతో ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.పోచమ్మ తల్లిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..



## గర్రెపల్లిలో ఘనంగా ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమం

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి 15 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా మల్టీపర్పస్ వర్కర్లకు నిత్యవసర సరుకులు పంపిణీ చేసి శాలువాతో ఘనంగా సన్మానించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో పెద్దపెల్లి ఇంచార్జ్ జిల్లా పంచాయతీ అధికారి దేవకీ దేవి సర్పంచ్ వీరగోని రమేష్ ఉప సర్పంచ్ బోగిరి నవీన్ పంచాయతీ కార్యదర్శి కొండ శ్రీధర్ కారోబార్ వెంకటేష్ గ్రామ పంచాయతీ సిబ్బంది వార్డు సభ్యులు గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు..



## రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-15 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని మార్కండేయ కాలనీకి వరకు నూతనంగా ఒక కోటి ఇరవై లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను ఆదివారం చింతకుంట విజయ రమణారావు పరిశీలించడం జరిగింది. బీటీ రోడ్డు నిర్మాణ పనులను మూలమలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న రోడ్డు విషయం ఎమ్మెల్యే స్థానిక కౌన్సిలర్ చింతల రాజు తెలుపగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు బీటీ రోడ్డును పరిశీలించి ఆ ప్రమాదకరంగా ఉన్న అటువంటి రోడ్డును సరి అయిన క్రమంలో నిర్మించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మిను పాల ప్రకాష్ రావు మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మాజీ సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ ఊట్ల వరప్రసాద్, సాయిరి మహేందర్ దాన్నాయక్ దామోదర్, గాదాసు రవి, వేగోళం అబ్బయ్య గౌడ్, ఈర్ల శేఖర్ చిలుక రాజేశం, బత్తుల దామోదర్,అసంపల్లి కనకయ్య బోదాస్ పోచయ్య, పర్వతం దేవయ్య, చెన్నూరు రవి, పల్లె వంశీ, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు..



# పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు

### ఆత్మీయత, మతసమరస్యానికి ప్రతీక

### రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

మక్తల్ మార్చ్ 15 వాయిస్ టుడే ప్రతినిధి: ఆదివారం మక్తల్ రాయల్ ఫంక్షన్ హాల్ లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా విందులో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రంజాన్ ముస్లిం సోదరులకు పవిత్ర మాసం అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఆచరించే ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు కుల,మత సామ్రాస్యానికి ప్రతికగా నిలుస్తుంది అన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో ముస్లిం సోదరులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉపవాస దీక్షలో పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముస్లింలలో కూడా చాలామంది బీదవారు ఉన్నారని వారిని అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మైనారిటీ అధికారి రషీద్,ఆల్మేవ చైర్మన్ షేక్ ఫరూక్ హుస్సేన్, బాలకృష్ణ రెడ్డి, కట్టా సూరి, మైనారిటీ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నురుద్దీన్, లాలా ,కౌన్సిలర్లు, మౌలానా గులాం మహమ్మద్ అబ్దుల్ ఖవీ హుసేని, బోయ రవి సిఐ రామ్ లాల్ ఎస్సై తాసిల్దార్ సురేష్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పాలక వర్గానికి ఘన సన్మానం

సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా మార్చి-15 వాయిస్ టుడే : సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్ పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత తో పాటు పదిహేను మంది కౌన్సిలర్లు, ఓదల మల్లన్న దేవాలయ డైరెక్టర్ సామల యమున హరికృష్ణ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ మాట్లాడుతూ, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కొరకు స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. అలాగే మరిన్ని సమస్యలపై దృష్టి సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఐల రమేష్, మంద శ్రీనివాస్ గౌడ్, జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ మూడు వందల నాలుగు జోనల్ చైర్ పర్సన్ చొప్పరి సుమన్, సలహాదారుడు మదరబోయిన రాజేంద్రప్రసాద్, కోశాధికారి సుంక వేణు, కొమురవెల్లి భాస్కర్, ప్రకాష్ రావు పెద్దన్న వాకర్ సభ్యులు ఉల్లంగుల శ్రీనివాస్, దూడం లింగమూర్తి, సుధాకర్, ఎల్లయ్య, జాన్వి శ్రీనివాస్, కామణి శ్రీకాంత్, ఎలగందుల మల్లేశం, కొలిపాక రవీందర్, బూడిద స్వామి, మద్దెల కొమురయ్య, సిరిపురం రమేష్, బిక్షపతి, కాసిం, అడ్వకేట్ ఆవుల శివకృష్ణ, కామణి వెంకటేశం, బైరగోని ప్రభాకర్, ఆరెపల్లి రాజు, పేద శంకర్, సన్నీ, పోడేటి వెంకటేష్, ప్రభాకర్, సంతోష్, కట్ల రాజమౌళి, రామకృష్ణ, అంతటి సంతోష్, అమిరి శెట్టి తిరుపతి, దర్శనాల రామచంద్రం, సాదుల సుగుణాకర్, సీనియర్ క్రీడాకారుడు ఎండి ముస్తఫా రాఘవులు, శ్రీనివాస్, పెండోట శ్రీనివాస్, వాకర్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఇఫ్తార్ విందులో పాల్గొన్నా మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్

ఝరాసంగం. మార్చ్ 15 (వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణంలోని భరత్ నగర్ లో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొనడం జరిగింది.. అనంతరం వారు మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి,సోదరభావనికి చిహ్నాలు అని సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని వారిని ఆకాంశక్షించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ అద్యక్షులు కండేం.నర్సింలు ,కౌన్సిలర్లు ఖదీర్ , చౌహన్ వాకీల్ , మహేష్ ,ఏ.యం.సి డైరెక్టర్ కిషన్ గారు,మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కాంగ్రెస్ నాయకులు హుగ్గేల్లి రాములు ,మోయిజ్ ,అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



## శాస్త్రి నగర్ పోచమ్మ బోనాలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ



సుల్తానాబాద్ పెద్దపెల్లి జిల్లా మార్చి-15 వాయిస్ టుడే : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని శాస్త్రి నగర్ లో పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి.ఇట్టి కార్యక్రమానికి సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ప్రజలు ఆనందంగా, భక్తి శ్రద్ధలతో బోనాల పండుగను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, యువకులు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## నిరుపేద కుటుంబానికి కుట్టు మిషన్‌ని అందజేసిన చలవది ప్రకాష్



పాల్వంచ మార్చ్ 15 (వాయిస్ టుడే): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ తల్లాడ మండలానికి చెందిన ఓ నిరుపేద ర్యాలీకి కుట్టు మిషన్ అందించి ఆర్థిక సాయం అందజేసిన సంఘటన పాల్వంచ లో జరిగింది. తల్లాడ కు చెందిన మీనా అనే నిరుపేదరాలు భర్త వికలాంగుడు, కుమారుడు రోడ్డు యాక్సిడెంట్ అయ్యి బ్లడ్ క్లాట్ అవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో పాల్వంచలోని వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్ రాజ్యలక్ష్మి కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఆర్థిక పరిస్థితిని గమనించిన వర్తక సంఘం కన్వీనర్ చలవారి ప్రకాష్ రాజ్యలక్ష్మి కుట్టు మిషన్ తో పాటు కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, స్వాతి పాల్గొన్నారు.



## మేధాపల్లిలో ఘనంగా ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక

వాయిస్ టుడే ఝరాసంగం మార్చ్15: ఝరాసంగం మండలం మేధాపల్లి గ్రామంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సర్పంచ్ అరుణ,ఉప సర్పంచ్ మజార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సోదరభావాన్ని చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా గ్రామంలోని ముస్లిం సోదరులతో కలిసి హిందూ, ఇతర సామాజిక వర్గాల వారు ఈ విందులో పాల్గొన్నారు. ఉపవాస దీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ, గ్రామం సుభిక్షంగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గ్రామ ఉప సర్పంచ్ మజార్ స్వయంగా దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అతిథులందరికీ రంజాన్ ఫలహారాలు మరియు విందు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమ వివరణ: సాయంత్రం ఉపవాస విరమణ సమయంలో మసీదు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ విందులో గ్రామ పెద్దలు, యువకులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మజార్ మాట్లాడుతూ పండుగలు మన మధ్య ప్రేమను, ఐకమత్యాన్ని పెంచుతాయని, మేధాపల్లి గ్రామం ఎప్పుడూ ఇలాగే కలిసికట్టుగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు అందరూ ఒకే చోట కూర్చుని విందును ఆరగించడం చూస్తుంటే గ్రామంలో ఉన్న మత సామరస్యం ప్రతిబింబించిందని పలువురు ప్రశంసించారు.కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిలాష్ రెడ్డి యూవ నాయకులు ఖైరోద్దీన్ ముజీబ్ అబ్దుల్ రెహమాన్ రియాజ్ పటేల్ చోటు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**